క్లుప్తంగా

మాక్స్‌వుడ్ మాడ్యులర్ ఫ్యాక్టరీ ప్రారంభం



ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలో మాక్స్‌వుడ్ ఇంటీరియర్ ఫ్యాక్టరీని బుధవారం మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. మాక్స్‌వుడ్ మేనేజింగ్ డైరెక్టర్ మేడి రూప్‌సాగర్ మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద ఇంటీరియర్ ఫ్యాక్టరీని అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సతీష్ రావు, క్రెడాయ్ అధ్యక్షుడు దినేష్, మాక్స్‌వుడ్ మంచిర్యాల బ్రాంచ్ హెడ్ నరేష్, జగిత్యాల బ్రాంచ్ హెడ్ వంగ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

21న స్పాట్ అడ్మిషన్లు

బెల్లంపల్లి: స్థానిక తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఈ నెల 21న స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వరూప ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఎంఈసీ గ్రూపులో మాత్రమే ఖాళీ సీట్లు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన బాలికలు నిర్దేశించిన తేదీలో ఉదయం 9-30గంటలకు తగిన ధ్రువీకరణ పత్రాలతో స్పాట్ అడ్మిషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని, అదే రోజు మధ్యాహ్నం 1గంటకు అర్హులకు అడ్మిషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందిని వెంటనే నియమించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణు డిమాండ్ చేశారు. ఆగస్టు 1న నిర్వహించే చలో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్నా ఫీజు రియెంబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. వసతి గృహాలకు పక్కాభవనాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు మామిడి అక్షిత తదితరులు పాల్గొన్నారు.

'నిరాధారిత మెసేజ్‌లు పెడితే సహించం'

జన్నారం: సామాజిక మాధ్యమాల్లో నిరాధారిత మెసేజ్‌లు పెడితే చర్యలు తప్పవని బుధవారం ఎస్సై సతీష్ తెలిపారు. లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం వస్తున్నందునా కొందరు సామాజిక మాధ్యమాల్లో ఆధారాలు లేకుండా మెసేజ్‌లు పెడుతూ, ఇతరులను ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఎటువంటి గుర్తింపు లేకుండా కొందరు విలేకరులం అంటూ, బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. బెదిరింపులకు పాల్పడటం కానీ, నిరాధారిత మెసేజ్‌లు సోషల్ మీడియాలో పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పనిముట్ల కొరత తీర్చాలి

శ్రీరాంపూర్: భూ గనుల్లో కార్మికులు రోజువారిగా వినియోగించే పనిముట్లు కొరత తీవ్రంగా ఉందని, దీన్ని వెంటనే తీర్చాలని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ కొట్టే కిషన్ రావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్కే-7 గనిపై ఫిట్ సెక్రెటరీ సారయ్య అధ్యక్షతన బుధవారం ఏ-రిలే, బీ-రిలే కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రిల్ బిట్లు, కీలలు, బోల్టర్ రాడ్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. సరిపడినంతగా సరఫరా చేయకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాజమాన్యం దీనిపై స్పందించి వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏ-రిలే నుంచి 13మందిని కౌన్సిల్ సభ్యులుగా, బీ-రిలే నుంచి 13మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

షీ టీమ్ సేవలపై అవగాహన

జన్నారం: మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జాడి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్సై సతీష్ సూచన మేరకు షీ టీమ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఓబులమ్మ మాట్లాడారు. జీవితం ఎంతో విలువైనదని, జీవితంలో జరిగే ఒడిదుడుకులను ఎదుర్కోవాలని సూచించారు. ముఖ్యంగా చరవాణి, ఫేస్‌బుక్, వాట్సాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ వచ్చినట్లైతే మొదటగా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఈ వయస్సులో ఏది చూసినా, అందంగా కనబడుతుందని, వాటి ప్రభావాలకు లోను కావద్దన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీ టీమ్ నంబర్ 6303923700 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పట్టువిడవని జీపీ కార్మికులు

- వానను సైతం లెక్కచేయకుండా నిరసన కార్యక్రమాలు
- 14వ రోజు కొనసాగిన సమ్మె



జన్నారం: వర్షంలో ర్యాలీ తీస్తున్న పారిశుధ్య కార్మికులు



కార్మికులకు మద్దతు తెలుపుతున్న ఏమాజీ



నెన్నెల: సమ్మెలో పాల్గొన్న కార్మికులు

భీమారం/నెన్నెల/బెల్లంపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/జన్నారం/కోటపల్లి: పారిశుధ్య కార్మికుల సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా బుధవారం జన్నారం మండల కేంద్రంలో ర్యాలీ తీశారు. వర్షంలో సైతం డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ, తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. వీరికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మద్దతు తెలుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు చందు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముజాఫర్ అలీఖాన్, యూత్ అధ్యక్షులు రమేష్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. భీమారంలో డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించి స్థానికంగా ఉన్న పలు దుకాణాల్లో భిక్షాటన చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. కోటపల్లిలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మెలో పాల్గొనగా, ఓయూ జేఏసీ చైర్మన్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మహేశ్, మల్లయ్య, బాపు, వెంకటస్వామి, భాస్కర్, సుఖేందర్, బాపు పాల్గొన్నారు. నెన్నెలలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానేష్, గోవింద్‌సింగ్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. హాజీపూర్‌లో జీపీ కార్మికుల దీక్షకు బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. కాసిపేటలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. మండల ఓబీసీ మోర్చ అధ్యక్షుడు శంకర్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మణిరాంసింగ్ పాల్గొన్నారు. బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయం ముందు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులను, ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రఘునాథ్‌కు పంచాయతీ కార్మికులు తమ డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణదేవరాయలు, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి కృష్ణ, నాయకులు, ప్రజాసంఘాల శ్రేణులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



కోటపల్లి: సమ్మెకు కాంగ్రెస్ నాయకుల మద్దతు



బెల్లంపల్లి: రఘునాథ్‌కు వినతిపత్రం ఇస్తూ...



హాజీపూర్‌లో సమ్మెకు బీఎస్పీ మద్దతు



భీమారంలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

బీఆర్ఎస్ హయాంలో రైతులకు మేలు

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



దండేపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దండేపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు అన్ని విధాల మేలు చేకూరిందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి రైతువేదిక వద్ద బుధవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ అందించి రైతుల కరెంటు కష్టాలు తీర్చిందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు కరెంటు కోసం పడిగాపులు కాయాల్సి వచ్చేదని, ఆ కష్టాలన్నింటినీ బీఆర్ఎస్ పూర్తిగా దూరం చేసిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, ఉపసర్పంచ్ భూమన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సత్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి భూమిపూజ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పూజ చేసిన అనంతరం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తోందని, ఈ క్రమంలో ముల్కల్ల గ్రామంలో వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా నేషనల్ హెల్త్ మిషన్ కింద మంజూరైన రూ.20లక్షల నిధులతో ముల్కల్ల పీహెచ్‌సీ నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పీహెచ్‌సీ నిర్మాణానికి స్థానికుడు గోనె సతీశ్‌రావు, తన తండ్రి హన్మంతరావు జ్ఞాపకార్థం 300గజాల స్థలాన్ని విరాళంగా అందజేసినందుకు గాను సతీశ్‌రావును ఎమ్మెల్యే దివాకర్‌రావు శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీపీ స్వర్ణలత, రైతుబంధు సమితీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'రైతులను గోసపెట్టిన పార్టీ కాంగ్రెస్'

లక్సెట్టిపేట: రైతులను గోసపెట్టిన పార్టీ కాంగ్రెస్ అని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మండలంలోని జెండావెంకటాపూర్‌లో రైతువేదిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని, వ్యవసాయంలో కరెంటు, నీళ్లు, ఎరువులు అందక అన్ని విధాల ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రైతుల ఉచిత కరెంటుపై కాంగ్రెస్ అనుచిత వాఖ్యలు చేయడం విడ్డూరమన్నారు. అనంతరం కార్యకర్తలతో చర్చించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ లింగయ్య, మండలాధ్యక్షులు చిన్నయ్య, సర్పంచ్ సునీత, నాయకులు మల్లారెడ్డి, సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

భాగవత సప్తాహం ప్రారంభం



ప్రవచనాలు చెప్తున్న రామనాథశర్మ

చెన్నూర్: లోక కళ్యాణార్థం పట్టణంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో అధిక శ్రావణ మాసం సందర్భంగా బుధవారం బ్రాహ్మణ సేవ సంఘం ఆధ్వర్యంలో భాగవత సప్తాహ ప్రవచనాలను మల్లాది వెంకట రామనాథశర్మ ప్రారంభించారు. భాగవత గ్రంథాన్ని పట్టణంలోని పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. సప్తాహ ప్రవచనాలు ఏడు రోజుల పాటు జరుగనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేవీఎం శ్రీనివాస్, కొమ్మెర రాజేశ్వర్, మురళి, పులి శంకరయ్య, భూషణ్‌శర్మ, సురేశ్, పురాణం శంకర్, దాగం శంకర్, దిగంబర్‌రావు, కసోజ్జుల బాస్కర్‌శర్మలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్



సమస్యలు తెలుసుకుంటున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 33వ వార్డు చింతపండు వాడలో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను, అభివృద్ధిని పట్టించుకోకుండా స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు దూషణలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలను పట్టించుకోని వారికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ది చెప్పాలన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నా, వాటిని పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే, మంచిర్యాల పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, రేకందర్ వాణి, రెడ్డిమల్ల అశోక్, పట్టి వెంకటకృష్ణ, కాశెట్టి నాగేశ్వర్‌రావు, స్వప్న, స్వాతి, రాజేశ్, తరుణ్ పాల్గొన్నారు.

'సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ, ఉద్యోగుల పాలిట శాపంగా మారిన నూతన పెన్షన్ స్కీం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) విధానాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యుఎస్‌పీసీ) నాయకులు డిమాండ్ చేశారు. మంచిర్యాల ఐబీ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం యుఎస్‌పీసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సీపీఎస్‌పై రాష్ట్రాల్లో ఉంచుతారా లేక తీసివేస్తారా అని అడిగినప్పటికీ నాన్చుడు ధోరణిని అవలంభిస్తున్నాయని ఆరోపించారు. ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యేగా చేసిన వ్యక్తులకు జీవితాంతం పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వం, ఉద్యోగులను పట్టించుకోకపోవటమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో యుఎస్‌పీసీ నాయకులు జాడి రాజన్న, గోళ్ల రామన్న, రమేష్, రాజావేణు, జయకృష్ణ, లక్ష్మణ్, విజయ్, కిరణ్, బారిక్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా అడవులు



భీమారం అటవీప్రాంతంలో మందుబాబులు తాగి పడేసిన సీసాలు

భీమారం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దనే నిబంధనలు ఉన్నా, కొందరు అవేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పచ్చని అడవులను పలువురు అపరిశుభ్రం చేస్తూ వారికి అడ్డాలుగా మార్చుకుంటున్నారు. మంచిర్యాల అటవీ డివిజన్‌లోని భీమారం రిజర్వు ఫారెస్ట్ గుండా జాతీయరహదారి ఉండటంతో అటుగా వెళ్లి జోరుగా విందులు, వినోదాల్లో మునిగితేలుతున్నారు. సింగరేణి ప్రాంతానికి దగ్గరలో ఉన్న భీమారం అటవీప్రాంతంలోనిత్యం యువత మత్తులో తేలియాడుతోంది. అయినా ఇంతా జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టికోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ సందర్భంగా అటవీశాఖ రేంజ్ అధికారి రమేశ్‌ను వివరణ కోరగా, భీమారం అడవుల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు జాతీయ రహదారి గుండా అటవీప్రాంతంలో సిబ్బందితో తనిఖీలు చేపడుతామని తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- అదనపు కలెక్టర్ బి.రాహుల్



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల ఏర్పాట్లను బుధవారం అడిషనల్ కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. శ్రీనివాస్‌గార్డెన్ నుంచి క్యాతనపల్లి కమాన్ వరకు రూ.22కోట్లతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులు అలాగే కమాన్ నుంచి ఏజోన్ రామాలయం, జయశంకర్ విగ్రహం, సూపర్‌బజార్, ఏరియా ఆసుపత్రి వరకు నిర్మించతల పెట్టిన అంతర్గతరోడ్ల పనులపై అధికారులతో చర్చించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, ఏఈ అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థి సంఘాల తీరు సరికాదు'



మాట్లాడుతున్న రాజేంద్రపాణి

నస్పూర్: పట్టణ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలపై పలు విద్యార్థి సంఘాలు, కుల విద్యార్థి సంఘాలు వ్యవహరిస్తున్న తీరు సరికాదని ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సీసీసీ నస్పూర్ శ్రీరాంపూర్ ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేంద్రపాణి, జిల్లా గౌరవ అధ్యక్షుడు బత్తిని దేవన్నతో కలిసి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలపై దౌర్జన్యానికి దిగడం, మహిళా ఉపాధ్యాయులతో అసభ్య పదజాలంతో మాట్లాడుతూ, విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకుని, పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగల్ల ఉపేందర్, పట్టణ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మైదం రామకృష్ణ, కోశాధికారి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఇందిరా

భీమిని: అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని కన్నెపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరా అన్నారు. కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు అవగాహన కల్పించారు. విధులకు సక్రమంగా హాజరుకావడంతో పాటు సమయపాలన పాటించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను సరిగ్గా మెయింటనెన్స్ చేయాలన్నారు. కోడిగుడ్ల సైజ్ చిన్నగా ఉన్నట్లయితే తీసుకోరాదని అన్నారు. సెంటర్ లోపల, బయట పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మిషన్ వాత్సల్య దరఖాస్తు చేసుకున్న వారు జిల్లా కేంద్రంలోని బాలరక్షా భవన్‌కు వెళ్లి అందజేయాలన్నారు. కార్యక్రమంలో కన్నెపల్లి మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

భూ సమస్య పరిష్కరించండి

జన్నారం: మండలంలోని కవ్వాల్ హాస్టల్ దందా గ్రామ శివారులోని పాలఘోరి సర్వే నంబర్ 112లో గల 631ఎకరాల భూమి అత్రం మాహమ్మ పేరుపై ఉన్నందునా, ఆ భూమిని రెవెన్యూ రికార్డుల్లో పరిశీలించి, భూ సమస్యను పరిష్కరించాలని ఆదివాసీ గిరిజనులు రాజు, చిత్రు, మోతిరాం కోరారు.

పరామర్శ

కోటపల్లి: జనగామ సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్ తల్లి కిష్టక్క మృతిచెందగా వారి కుటుంబాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్‌ను పరామర్శించి ఓదార్చారు.

'దుర్భాషలాడడం సరికాదు'

కాసిపేట: నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే చిన్నయ్య రాష్ట్రంలో అభివృద్ధి చేస్తారనుకుంటే, లైంగిక వేదింపుల్లో అభివృద్ధి చేసి దేశ స్థాయిలో గుర్తింపు తెచ్చారని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం ప్రదీప్ విమర్శించారు. జాతీయ నాయకుడు అయిన వెంకటస్వామిని, వారి కుమారుడు మాజీ మంత్రి వినోద్‌పై దుర్భాషలాడడం సరికాదన్నారు.

భూమిపూజ

తాండూర్: మండలంలోని బోయపల్లిలో బుధవారం ఎమ్మెల్యే చిన్నయ్య సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.

సబ్‌సెంటర్‌కు ఇనుప బెడ్ వితరణ

నస్పూర్: పట్టణ పరిధిలోని కృష్ణాకాలనీ సబ్ సెంటర్‌కు రోగుల సౌకర్యార్థం చార్వాక మూగ, చెవిటి సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు ఇనుప బెడ్‌ని అందించారు.

రజక సంఘం కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: తెలంగాణ రజక సంఘాల సమితి తాళ్లపెల్లి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కృష్ణాకాలనీలో బుధవారం జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి పుట్టపాక తిరుపతి తదితరులు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు.

బ్యాగుల పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 80మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్, బ్యాగ్, నోట్‌పుస్తకాలు, జామెట్రీబాక్స్ అందించారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన



కోటపల్లి: మాట్లాడుతున్న సీహెచ్‌వో



వేమనపల్లి: ర్యాలీ తీస్తున్న వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది



బెల్లంపల్లి: మాట్లాడుతున్న శివ ప్రతాప్

మందమర్రిరూరల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించగా డాక్టర్ రమేష్ హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. పలు వార్డుల్లో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

వేమనపల్లి: మండల కేంద్రంలో నీల్వాయి, ముల్కలపేట, జిల్లెడ, చామనపల్లి సబ్‌సెంటర్ల పరిధిలోని గ్రామాల్లో బుధవారం వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో ర్యాలీలు తీశారు. సంవత్సరం వయస్సు నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సరోజ, ఏఎన్ఎంలు రాజేశ్వరి, విజ య, కళావతి, మంజుల, శైలేజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: నులి పురుగుల నిర్మూలన మాత్రలను ప్రతి ఒక్కరూ విధిగా వేసుకోవాలని తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యుడు శివ ప్రతాప్ అన్నారు. పీహెచ్‌సీలో బుధవారం వైద్య, ఐసీడీఎస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. 1 నుంచి 19ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ నులి పురుగుల నిర్మూలన మాత్రలు వేసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎంఈవో మహేశ్వర్ రెడ్డి, హెచ్ఓఈ సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

కోటపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నులిపురుగుల నిర్మూలనపై సీహెచ్‌వో రామ్మూర్తి ఆశ కార్యకర్తలకు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలు అందనివారి సర్వే పకడ్బందీగా చేపట్టి మిషన్ ఇంద్రధనుష్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు జ్యోతి, శోభారాణి,హెల్త్ అసిస్టెంట్ శ్రీనాథ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళకు రక్తం అత్యవసరమని తెలుసుకున్న విద్యార్థి సంఘం నాయకుడు షేక్ సల్మాన్‌పాషా స్పందించి రక్తదానం చేశారు. బీ పాజిటివ్ రక్తం అవసరం కావటంతో, రెడ్‌క్రాస్ సొసైటీకి చేరుకుని రక్తదానం చేసి, మానవత్వం చాటుకున్నారు.